# యువ వెలుగు

PRGI: TGTEL/26/A6429

E- Paper, www.yuvavelugu.com

తెలుగు దిన పత్రిక


## 70 మ్యూల్ అకౌంట్లతో సైబర్ మోసాలు

**హైదరాబాద్‌లో ఇద్దరి అరెస్ట్**

- సైబర్ నేరగాళ్లకు మ్యూల్ అకౌంట్లు సరఫరా చేస్తున్న ఇద్దరి అరెస్ట్
- ఈ ఖాతాల ద్వారా రూ.70 కోట్ల వరకు లావాదేవీలు జరిపినట్లు గుర్తింపు
- దేశవ్యాప్తంగా 450 సైబర్ కేసులతో ఈ అకౌంట్లకు సంబంధం
- పాత రూపాయి నోటు మోసం కేసు దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన భారీ నెట్‌వర్క్
- కమిషన్ ఆశ చూపి విద్యార్థులు, డెలివరీ బాయ్స్ నుంచి ఖాతాల సేకరణ

2లో


యువ వెలుగు తెలుగు దిన పత్రికలో పని చేయుటకు

రిపోర్టర్లు కావలెను

మండలం । నియోజకవర్గం । జిల్లా వారీగా రిపోర్టర్లు కావలెను

9908 502 602



సంపుటి : 01 సంచిక : 39 ప్రచురణ : రంగారెడ్డి ఎడిటర్ : పి. మహేష్ గౌడ్ సోమవారం 12-10-2026 పేజీలు : 4 ధర :- 02/-


# హైదరాబాద్ డ్రగ్స్‌కు మూలం గోవానే ..

## రేవంత్ సంచలన ఆరోపణ



- గోవాలో రేవంత్ రెడ్డి పర్యటన
- సీఎం ప్రమోద్ సావంత్ లక్ష్యంగా ఆరోపణలు
- ఆయన ప్రమోద్ సావంత్ కాదు, ప్రాపర్టీ సావంత్ అని విమర్శ
- హైదరాబాద్‌లో పట్టుబడిన డ్రగ్స్‌కు మూలం గోవానేనని ఆరోపణ
- భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని మండిపాటు
- గోవాను కాపాడుకోవడానికి కాంగ్రెస్ అధికారంలోకి రావాలని పిలుపు

**హైదరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 11** :తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గోవాలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గోవాను డ్రగ్స్‌కు అడ్డాగా మార్చారని, ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ కాదు, భూములు కబ్జా చేస్తున్న 'ప్రాపర్టీ సావంత్' అని ఆయన పదునైన విమర్శలు చేశారు. గోవాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'గోయ్ రాఖోన్స్' (సేవ్ గోవా) యాత్రలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ పాలనలో గోవా యువత నిరుద్యోగంతో నిరాశకు లోనవుతున్నారని, ప్రమాదకరమైన మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. "హైదరాబాద్‌లో పట్టుబడుతున్న డ్రగ్స్‌కు మూలాలు గోవాలోనే ఉన్నాయి. అక్కడి నుంచే దేశంలోని ప్రధాన నగరాలకు మాదకద్రవ్యాలు అక్రమంగా రవాణా అవుతున్నాయి" అని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. దిశా డైలీ కథనం ప్రకారం, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లతో డ్రగ్స్ నెట్‌వర్క్‌లను కూల్చివేశామని, కానీ గోవా మాత్రం డ్రగ్స్‌కు ప్రధాన కేంద్రంగా మారిందని ఆయన తెలిపారు. గోవా సీఎం ప్రమోద్ సావంత్‌పై విమర్శలు కొనసాగిస్తూ, ⏭ తరువాయి 2లో..

# సీజేఐ అపాయింట్‌మెంట్ కోరిన ఖర్గే, రాహుల్

**దేశ రాజకీయ పరిస్థితులపై ఆందోళనలు వివరిస్తామన్న కాంగ్రెస్ అధ్యక్షుడు**

**"డిమాండ్ చేయలేం.. చేతులు జోడించి విజ్ఞప్తి చేస్తాం"**

**భారీ బలగాల మోహరింపు, సీఈసీకి చట్టపరమైన రక్షణపై కేంద్రంపై ధ్వజం**

**న్యూఢిల్లీ, యువ వెలుగు, అక్టోబర్ 11** : దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై తమ ఆందోళనలను నేరుగా న్యాయవ్యవస్థ దృష్టికి తీసుకెళ్లాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఇందులో భాగంగా భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)ని కలిసేందుకు తాను, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ కోరినట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదివారం వెల్లడించారు. సోమవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య సమావేశానికి సమయం కేటాయించాలని కోరుతూ సీజేఐకి లేఖ రాసినట్లు ఖర్గే తెలిపారు. రాహుల్ గాంధీ కూడా విడిగా లేఖ రాసి అపాయింట్‌మెంట్ కోరారని చెప్పారు.



దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను ప్రధాన న్యాయమూర్తికి వివరించడమే తమ ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

**"విజ్ఞప్తి మాత్రమే చేస్తాం"**

సీజేఐతో భేటీ విషయంలో తమ వైఖరిని ఖర్గే స్పష్టం చేశారు. "ఆయనను మేం ఏదీ డిమాండ్ చేయలేం. చేతులు జోడించి విజ్ఞప్తి మాత్రమే చేస్తాం" అని అన్నారు. ప్రతిపక్షం తన ఆందోళనలను ప్రధాన న్యాయమూర్తి ముందు ఉంచాలని మాత్రమే భావిస్తోందని, అంతకు మించి ⏭ తరువాయి 2లో..

## తిరుమల శ్రీవారి దసరా బ్రహ్మోత్సవాల పూర్తి షెడ్యూల్



- వివరాలు 2లో..



శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ ఏడుపాయల వనదుర్గా భవానీమాత బాలా త్రిపుర సుందరీదేవి (శైలపుత్రి) రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.

# నేతలు నిర్బంధంలో.. జంతర్ మంతర్ వద్ద ఉత్కంఠగా సీజేపీ ఆందోళన




**ఢిల్లీ** : ఢిల్లీ వీధుల్లో ఈరోజు ఉదయం వినబడుతున్నది కేవలం పోలీసుల బూట్ల చప్పుడు మాత్రమే కాదు... ప్రజాస్వామ్యం గొంతు నొక్కబడుతోందన్న ఆగ్రహ జ్వాలల హోరు.. నాయకులను అర్ధరాత్రి వేళ అకారణంగా అరెస్టు చేసి ఇనుప సంకెళ్లు వేయవచ్చు గాక... కానీ ఒక ఆశయాన్ని, ప్రజా చైతన్యాన్ని ఏ సంకెళ్లైనా ఆపగలవా? తమకు దిశానిర్దేశం చేసే మార్గదర్శకులు జైలు గోడల వెనుక ఉన్నప్పటికీ లొంగేది లేదంటూ గుండె నిండా ధైర్యాన్ని నింపుకుని జంతర్‌మంతర్ వైపు అడుగులు వేస్తున్న వేలాది మంది కార్యకర్తల పోరాటం ఇప్పుడు యావత్ దేశం కళ్లను చెమ్మగిల్లేలా చేస్తోంది. ఇది కేవలం ఒక రాజీనామా కోసం జరుగుతున్న నిరసన కాదు.. నాటి త్యాగాల పునాదులపై నిర్మితమైన ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి సామాన్యుడు సాగిస్తున్న ఒక ఆవేదన భరితమైన ధర్మపోరాటం.. ఈ పోరాటం ఏ దిశగా వెళుతుందో చూడాలి మరీ.. దేశ రాజధాని న్యూఢిల్లీలో నిరసనల సెగ రోజురోజుకూ ఉద్రిక్తతలను సంతరించుకుంటోంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలంటూ 'సిటిజెన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్' (సీజేపీ) చేపట్టిన ఆందోళన తీవ్ర రూపం దాలుస్తోంది. ఎన్ని నిర్బంధాలు, ఆంక్షలు ఎదురైనా సరే తమ డిమాండ్ నెరవేరే వరకు వెనక్కి తగ్గేది లేదని సీజేపీ స్పష్టం చేసింది. నేడు జంతర్‌మంతర్ వద్ద భారీ నిరసనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో అక్కడ ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయనేది సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది.

నాయకులు లేకుండానే ఉద్యమం.. అసలైన సవాల్ ఈ ⏭ తరువాయి 2లో..



# ఢిల్లీ-చెన్నై ఇండిగో విమానంలో కలకలం

**శంషాబాద్ ఎయిర్ పోర్టులో ఎమర్జెన్సీ ల్యాండింగ్**

- ఢిల్లీ-చెన్నై ఇండిగో విమానంలో అగ్నిప్రమాదం
- హైదరాబాద్‌కు అత్యవసరంగా మళ్లింపు
- ప్రయాణికుడి పవర్ బ్యాంక్ కారణంగా చెలరేగిన మంటలు
- వెంటనే అప్రమత్తమై మంటలార్పిన విమాన సిబ్బంది
- ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నారని వెల్లడి

**హైదరాబాద్** : ఇండిగో విమానంలో ఓ ప్రయాణికుడి పవర్ బ్యాంక్ కారణంగా మంటలు చెలరేగడంతో తీవ్ర కలకలం రేగింది. విమానం గాల్లో ఉండగా ఈ ఘటన జరగడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన విమాన సిబ్బంది మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన కారణంగా విమానాన్ని హైదరాబాద్‌లోని శంషాబాద్ ⏭ తరువాయి 2లో..

# అమ్మవారి ఆశీస్సులతో ఏపీ సుభిక్షంగా వర్ధిల్లాలి: సీఎం చంద్రబాబు

- ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సీఎం చంద్రబాబు దసరా నవరాత్రుల శుభాకాంక్షలు
- అధర్మంపై ధర్మం గెలిచిన పండుగ దసరా అని వ్యాఖ్య
- ఇంద్రకీలాద్రి దుర్గమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్ష
- రాష్ట్రం సుభిక్షంగా, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు వెల్లడి

**అమరావతి, యువ వెలుగు, అక్టోబర్ 11** : ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ముఖ్య మంత్రి చంద్రబాబు దసరా శరన్నవరాత్రుల శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం (అక్టోబరు 11) ప్రారంభమవుతున్న నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆయన సోషల్ మీడియా వేదికగా తన సందేశాన్ని పంచుకున్నారు. దుష్ట శక్తులపై దైవశక్తి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి దసరా పండుగ ప్రతీక అని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నేడు ప్రారంభమవుతున్న శరన్నవరాత్రుల్లో అమ్మవారిని తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఆరాధించడం మన



సంప్రదాయంలో ఎంతో విశిష్టమైనది. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దివ్య ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలి" అని ఆకాంక్షించారు.

అమ్మ వారి కరుణా కటాక్షాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని, ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలని చంద్రబాబు మనస్ఫూర్తిగా కోరుకున్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తన సందేశంలో పేర్కొన్నారు. హిందూ సంప్రదాయంలో దసరా పండుగకు, శరన్నవరాత్రి ఉత్సవాలకు ఉన్న ప్రాధాన్యతను ఆయన తన మాటల్లో గుర్తుచేశారు.

# ప్రభుత్వం భయపడుతోంది

## అందుకే సీఈసీపై పోరాటాన్ని తమపైకి మళ్లించుకుంది: సీజేపీ

- సీఈసీకి వ్యతిరేక నిరసనను ప్రభుత్వం తమపైకి మళ్లించుకుంటోందని సీజేపీ ఆరోపణ
- గత 72 గంటల్లో దేశంలో ఎమర్జెన్సీని మించిన అరాచకం చూశామన్న అశుతోష్ రంకా
- మోదీ, అమిత్ షా ఆదేశాలతోనే ఎన్నికల సంఘం పనిచేస్తోందని విమర్శ
- సీజేపీ వ్యవస్థాపకుడి కుటుంబ విషాదంలో ఢిల్లీ పోలీసుల తీరు అమానుషమని వ్యాఖ్య
- తమ పోరాటానికి మద్దతిచ్చిన నలుగురు మాజీ ముఖ్యమంత్రులకు కృతజ్ఞతలు

**న్యూఢిల్లీ, యువ వెలుగు, అక్టోబర్ 11** : ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా తాము చేస్తున్న




శాంతియుత నిరసనలను చూసి కేంద్ర ప్రభుత్వం భయపడుతోందని, అందుకే ఈ పోరాటాన్ని మోదీ, అమిత్ షాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంగా మార్చుకుందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తీవ్రంగా ఆరోపించింది. ముందస్తు అరెస్టు కింద అదుపులోకి తీసుకున్న తర్వాత విడుదలైన ⏭ తరువాయి 2లో..

- ఆఫ్రికా తీరంలో వలసదారులతో వెళుతున్న పడవ బోల్తా
- ప్రమాదంలో 15 మంది చిన్నారులతో సహా 109 మంది మరణం
- మరో 116 మంది ఆచూకీ గల్లంతు, కొనసాగుతున్న గాలింపు చర్యలు
- జిబౌటి నుంచి యెమెన్‌కు వెళుతుండగా జరిగిన ఘోర దుర్ఘటన
- 80 మందిని అధికారులు కాపాడగా, సహాయక చర్యలు చేపట్టిన ఐఓఎం

# ఆఫ్రికా తీరంలో పెను విషాదం

## పడవ ప్రమాదంలో 109 మంది మృతి



**ఆఫ్రికా** : ఆఫ్రికా తీరంలో పెను విషాదం చోటుచేసుకుంది. మెరుగైన భవిష్యత్తు కోసం వలస వెళుతున్న వారి జీవితాలు సముద్రంలో కలిసిపోయాయి. సుమారు 350 మందితో ప్రయాణిస్తున్న ఒక పడవ బోల్తా పడిన ఘటనలో 109 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 15 మంది చిన్నారులు కూడా ఉన్నారు. మరో 116 మందికి పైగా గల్లంతయ్యారని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని అంతర్జాతీయ వలసల సంస్థ (IOM) ఆదివారం ప్రకటించింది.

వివరాల్లోకి వెళితే, అక్టోబర్ 8-9 మధ్య రాత్రి సమయంలో జిబౌటి నుంచి యెమెన్‌కు వలసదారులతో ఈ పడవ బయలుదేరింది. జిబౌటిలోని ఒబాక్ పోర్ట్ పట్టణానికి ఉత్తరాన ఉన్న గుహెరే సమీపంలోకి రాగానే పడవ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు 109 మృతదేహాలను వెలికితీశారు. వీరిలో ⏭ తరువాయి 2లో..

## హైదరాబాద్ డ్రగ్స్‌కు మూలం గోవానే ..

(మొదటి పేజీ తరువాయి)

ఆయన భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. గోవా అస్తిత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, బీజేపీ ప్రభుత్వం స్థానిక ప్రజల పట్ల తీవ్ర వివక్ష చూపుతోందని మండిపడ్డారు.

రెండుసార్లు బీజేపీని నమ్మి గోవా ప్రజలు మోసపోయారని రేవంత్ అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును, యువతను కాపాడుకోవాలంటే బీజేపీ అస్తవ్యస్త పాలనకు చరమగీతం పాడాలని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

## 70 మ్యూల్ అకౌంట్లతో సైబర్ మోసాలు

**హైదరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 11 :** సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు (మ్యూల్ అకౌంట్లు) సరఫరా చేస్తూ భారీ మోసాలకు సహకరిస్తున్న ఇద్దరు వ్యక్తులను హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరు అందించిన సుమారు 70 మ్యూల్ అకౌంట్ల ద్వారా దేశవ్యాప్తంగా 450 సైబర్ క్రైమ్ కేసులు నమోదయ్యాయని, వీటిలో రూ.60 నుంచి 70 కోట్ల వరకు లావాదేవీలు జరిగాయని పోలీసులు ఆదివారం వెల్లడించారు. రామాంతపూర్‌కు చెందిన గుమ్మ రమేశ్ (39), ముదలె అనిల్ (19) అనే ఇద్దరిని నిందితులుగా గుర్తించారు. ఫేస్‌బుక్ ద్వారా పాత రూపాయి నోటుకు రూ.45 లక్షలు ఇస్తామని నమ్మించి, ఓ బాధితుడి నుంచి రూ.7,93,351 వసూలు చేసిన మోసంపై అందిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో భాగంగా దర్యాప్తు చేయగా ఈ భారీ నెట్‌వర్క్ గుట్టు రట్టయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఐటీ చట్టంలోని సెక్షన్లు 66జ, 66ఙ లతో పాటు బీఎన్ఎస్ చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. విచారణలో నిందితులు తమ నేరాన్ని అంగీకరించినట్లు సైబర్‌క్రైమ్ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ డీసీపీ ఎస్. చైతన్య కుమార్ తెలిపారు. తమ సంపాదన సరిపోకపోవడంతో, సులభంగా డబ్బు సంపాదించేందుకు ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు నిందితులు చెప్పారన్నారు. ప్రధాన నిందితుడు రమేష్ గతంలో కర్ణాటకలోని బీదర్‌లో నివసించి, ఆర్థిక ఇబ్బందులతో హైదరాబాద్‌కు వచ్చి క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్లతో పరిచయాలు పెంచుకున్నాడు. పరారీలో ఉన్న మరో నిందితుడితో కలిసి రామాంతపూర్ పరిసరాల్లోని విద్యార్థులు, డెలివరీ పార్ట్‌నర్లకు కమిషన్ ఆశ చూపి, వారి పేర్లతో బ్యాంకు ఖాతాలు తెరిపించాడు. ఇలా సేకరించిన దాదాపు 70 అకౌంట్లకు సంబంధించిన పాస్‌బుక్‌లు, ఏటీఎం కార్డులు, సిమ్ కార్డులను హరియాణాలోని సైబర్ నేరగాళ్లకు కొరియర్ ద్వారా పంపేవాడు. రెండో నిందితుడైన అనిల్, రమేశ్ నుంచి కమిషన్ తీసుకుని మూడు బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి, వాటి వివరాలను అతనికి అందజేశాడు. ఈ కేసులో పరారీలో ఉన్న నిందితుడితో పాటు ప్రధాన సైబర్ ముఠా కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఇంద్రసేనారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి



**దేవరుప్పుల, యువ వెలుగు, అక్టోబర్ 11 :** దేవరుప్పుల మండలం, కడవెండి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఎర్రం రెడ్డి ఇంద్రసేనారెడ్డి గారు ఇటీవల మరణించగా, ఈరోజు పాలకుర్తి నియోజకవర్గ శాసనసభ్యురాలు శ్రీమతి మామిడాల యశస్విని రెడ్డి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి గారి మృతి పట్ల ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గారు సంతాపం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఇంద్రసేనారెడ్డి గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల అధ్యక్షులు దావెరా అనిల్ కుమార్ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జనగామ జిల్లా దశాబ్ది వేడుకలకు కదిలిన గులాబీ దండు

**ఎర్రబెల్లి ఆదేశాలతో.. ఏల సుందర్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ**



**దేవరుప్పుల, యువ వెలుగు, అక్టోబర్ 11 :** జనగామ జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన జిల్లా ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు బీఆర్ఎస్ మండల ముఖ్య నాయకులు ఏల సుందర్ ఆధ్వర్యంలో దేవరుప్పుల మండల కేంద్రం నుంచి జనగామ జిల్లా కేంద్రానికి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏల సుందర్ పార్టీ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీలో పాల్గొని పార్టీ నినాదాలతో హోరెత్తించారు. అనంతరం జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా ఆవిర్భావ దశాబ్ది వేడుకలకు చేరుకుని కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సోమవారం జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమం రద్దు

## ప్రజలు తమ వినతులతో కలెక్టరేట్‌కు రావద్దు : జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**యువ వెలుగు, అక్టోబర్ 11 :** జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ సోమవారం (అక్టోబర్ 12)న రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రబీ పంటల ప్రణాళిక, పంటల సాగు విధానాలు, పంటల వైవిధ్యీకరణ, వ్యవసాయ నిర్వహణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రైతులను ఉద్దేశించి ప్రసంగించనున్న నేపథ్యంలో, అక్టోబర్ 12వ తేదీ (సోమవారం)న నిర్వహించనున్న రైతు నేస్తం కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించే జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు స్పష్టం చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ వినతులు, ఫిర్యాదులతో సోమవారం కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ కోరారు. అయితే డివిజన్ స్థాయి, మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయని కలెక్టర్ వెల్లడించారు. ప్రజలు తమ సమస్యలు, వినతులను సంబంధిత డివిజన్, మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాల్లో సమర్పించుకోవచ్చని సూచించారు.

## వాహనం అదుపు తప్పి చోటు చేసుకున్న ప్రమాదం : సురక్షితంగా బయటపడిన ప్రయాణికులు



**సూర్యాపేట, యువ వెలుగు, అక్టోబర్ 11 :** సూర్యాపేట–జనగాం రహదారి NH 365B పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ప్రయాణికులు ప్రాణాపాయం నుండి సురక్షితంగా బయటపడ్డారు. కొత్తగూడెం నుండి కరీంనగర్ వెళ్తున్న టాటానెక్సోన్ కారు, లింగాల ఘనపూర్ మండలం, వనపర్తి మరియు వడిచర్ల గ్రామాల మధ్య ఉన్నప్పుడు ఒక్కసారిగా కుడివైపు టైరు పగిలిపోయింది. దీనితో వాహనం అదుపు తప్పి, రోడ్డు పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టింది. అయితే, టాటానెక్సోన్ లోని ఎయిర్ బ్యాగ్స్ సమయానికి తెరుచుకోవడం వల్ల పెద్ద ప్రమాదం తప్పి, ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు.

## ఫ్లాష్.. ఫ్లాష్.. ఫ్లాష్..



**యువ వెలుగు, అక్టోబర్ 11 :** గ్రామ ప్రజలకు మరియు రైతులకి ప్రజలందరికీ విజ్ఞప్తి చేయునది ఏమనగా రేపు అనగా దివి 12-10-2026 సోమవారం రోజున ఉదయం 11:00 గంటలకు తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రిచే ఎల్ నినో వర్షాబావ ప్రభావము మరియు రబీ సీజన్ క్రాప్ ప్లాన్ గురించి వీడియో కాన్ఫరెన్స్ బండ్లగూడెం రైతు వేదికలో కలదు. కావున గ్రామ ప్రజలందరూ బండ్లగూడెం రైతు వేదికకి హాజరు కాగలరని మనవి .

**ఇట్లు**
**నర్సింగ రామకృష్ణ, సర్పంచ్ నెల్లుట్ల,**
**లింగాల ఘనపూర్ మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు.**

## తిరుమల శ్రీవారి దసరా బ్రహ్మోత్సవాల పూర్తి షెడ్యూల్

**తిరుమల, యువ వెలుగు, అక్టోబర్ 11 :** తిరుమల పుణ్యక్షేత్రం మరో ఉత్సవానికి సిద్ధమైంది. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 12వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనున్నాయి. అధికమాసం రావడం వల్ల ఈ ఏడాది స్వామివారికి రెండు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే భాద్రపద మాసంలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు ముగియగా, దసరా నవరాత్రులను పురస్కరించుకుని ఆశ్వయుజ మాసంలో ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. అక్టోబరు 11న అంకురార్పణతో ఈ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. సాధారణంగా చాంద్రమానం ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి అధికమాసం వస్తుంది. ఇలా వచ్చినప్పుడు కన్యామాసంలో (భాద్రపదం) వార్షిక బ్రహ్మోత్సవాలు, ఆశ్వయుజ మాసంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం తిరుమల సంప్రదాయం. ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ఒక ప్రత్యేకత ఉంది. వార్షిక బ్రహ్మోత్సవాల తరహాలో వీటికి ధ్వజారోహణం, ధ్వజావరోహణం వంటి ఘట్టాలు ఉండవు. అంకురార్పణతో నేరుగా ఉత్సవాలు ప్రారంభమై, చక్రస్నానంతో పరిసమాప్తం అవుతాయి. ఈ ఉత్సవాల్లో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఎదురుచూసే గరుడ వాహన సేవ అక్టోబరు 16న జరగనుంది. అలాగే, అక్టోబరు 17న పుష్పక విమానం, 19న స్వర్ణరథం ఊరేగింపు, 20న చక్రస్నానం ఘట్టాలు వైభవంగా జరగనున్నాయి. ప్రతిరోజూ ఉదయం వాహన సేవలు 8 గంటల నుంచి 10 గంటల వరకు, రాత్రి సేవలు 7 గంటల నుంచి 9 గంటల వరకు జరుగుతాయి. అయితే, గరుడ వాహన సేవ మాత్రం అక్టోబరు 16న సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 11.30 గంటల వరకు విశేషంగా నిర్వహిస్తారు.

**నవరాత్రి బ్రహ్మోత్సవాల పూర్తి షెడ్యూల్:**

అక్టోబరు 11: అంకురార్పణం (రాత్రి 7 నుంచి 9 గంటల వరకు)
అక్టోబరు 12: బంగారు తిరుచ్చి ఉత్సవం (ఉదయం 9 గంటలకు), పెద్దశేష వాహనం (రాత్రి 7 గంటలకు)
అక్టోబరు 13: చిన్నశేష వాహనం (ఉదయం 8 గంటలకు), హంస వాహనం (రాత్రి 7 గంటలకు)
అక్టోబరు 14: సింహ వాహనం (ఉదయం 8 గంటలకు), ముత్యపుపందిరి వాహనం (రాత్రి 7 గంటలకు)
అక్టోబరు 15: కల్పవృక్ష వాహనం (ఉదయం 8 గంటలకు), సర్వభూపాల వాహనం (రాత్రి 7 గంటలకు)
అక్టోబరు 16: మోహినీ అవతారం (ఉదయం 8 గంటలకు), గరుడ వాహనం (సాయంత్రం 6.30 గంటలకు)
అక్టోబరు 17: హనుమంత వాహనం (ఉదయం 8 గంటలకు), పుష్పక విమానం (సాయంత్రం 4 గంటలకు), గజ వాహనం (రాత్రి 7 గంటలకు)
అక్టోబరు 18: సూర్యప్రభ వాహనం (ఉదయం 8 గంటలకు), చంద్రప్రభ వాహనం (రాత్రి 7 గంటలకు)
అక్టోబరు 19: స్వర్ణరథం (ఉదయం 7 గంటలకు), అశ్వ వాహనం (రాత్రి 7 గంటలకు)
అక్టోబరు 20: చక్రస్నానం (ఉదయం 6 గంటలకు)

అక్టోబరు 20వ తేదీన ఉదయం 6 గంటలకు శ్రీవారి పుష్కరిణిలో చక్రస్నానం మహోత్సవంతో ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగుస్తాయి. ఈ తొమ్మిది రోజుల పాటు శ్రీవారు వివిధ వాహనాలపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేయనున్నారు.

# ప్రభుత్వం భయపడుతోంది

(మొదటి పేజీ తరువాయి)

కొన్ని గంటలకే, సీజేపీ సహ కన్వీనర్ అశుతోష్ రంకా ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా అశుతోష్ రంకా మాట్లాడుతూ, "గత 72 గంటల్లో దేశం తీవ్రమైన అరాచక పాలనను చూసింది. నిర్దేశిత ప్రాంతంలో శాంతియుతంగా నిరసన తెలియజేయాలనుకున్న వేలాది మందిని దేశవ్యాప్తంగా అదుపులోకి తీసుకున్నారు. నిన్న మమ్మల్ని విమానం నుంచి కిడ్నాప్ చేసినంత పని చేశారు. పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, మేము మా తల్లిదండ్రుల నుంచి విన్న 1975 ఎమర్జెన్సీ కథలను కూడా ఈ 72 గంటల పరిణామాలు మించిపోయాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా వల్లే ఈ దుస్థితి దాపురించిందని ఆయన ఆరోపించారు. "ఒక విషయం స్పష్టమైంది. ఎన్నికల సంఘం, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ప్రారంభమైన ఈ పోరాటాన్ని ప్రధాని మోదీ, అమిత్ షాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంగా మార్చారు" అని ఆయన పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ఎన్నికల సంఘం, పూర్తిగా ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాల కనుసన్నల్లోనే పనిచేస్తోందని, కేవలం బీజేపీని ఎన్నికల్లో గెలిపించడమే లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కుటుంబంలో జరిగిన విషాదం పట్ల ఢిల్లీ పోలీసులు వ్యవహరించిన తీరుపై అశుతోష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం అభిజీత్ నాయనమ్మ మరణవార్త తెలిసినప్పుడు కూడా ఢిల్లీ పోలీసులు అత్యంత అమానవీయంగా ప్రవర్తించారని, కెమెరాలు, మైక్రోఫోన్లతో వచ్చి ఆ విషాదాన్ని కూడా ఒక ప్రదర్శనగా మార్చడానికి ప్రయత్నించారని ఆరోపించారు. "తన తల్లిదండ్రులు గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని, వారికి సులభంగా ఆందోళన కలుగుతుందని, అందుకే తన కజిన్‌తో మాట్లాడనివ్వాలని అభిజీత్ వేడుకున్నా ఢిల్లీ పోలీసులు కనికరించలేదు" అని రంకా తెలిపారు.

తాను తన నాయనమ్మ అంత్యక్రియల కోసం మహారాష్ట్రలోని సొంత ఊరికి వెళుతున్నానని, అయితే సీజేపీ వెనక్కి తగ్గదని, బెదిరింపులకు భయపడదని అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. అభిజీత్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ దుఃఖ సమయంలో తామంతా అతడికి అండగా నిలుస్తామని రంకా అన్నారు. ఈ పోరాటంలో తమకు మద్దతుగా నిలిచిన ప్రతిపక్ష నేతలకు సీజేపీ కృతజ్ఞతలు తెలిపింది. "నలుగురు మాజీ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ, మాణిక్ సర్కార్, పినరయి విజయన్ వీధుల్లోకి వచ్చి యువతతో కలిసి నిలబడటం ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి వారు చేస్తున్న పోరాటానికి నిదర్శనం. వారికి మా హృదయపూర్వక ధన్యవాదాలు" అని రంకా పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఏ వంటి వామపక్ష విద్యార్థి సంఘాల సభ్యులను కూడా పోలీసులు అత్యంత క్రూరంగా అదుపులోకి తీసుకున్నారని ఆయన ఆరోపించారు. "ఈ పోరాటం ఇప్పుడే మొదలైంది. దీనిని ఒక యుద్ధంగా మార్చినందుకు ప్రభుత్వం సిగ్గుపడాలి" అని ఆయన వ్యాఖ్యానించారు.

# ఆఫ్రికా తీరంలో పెను విషాదం

(మొదటి పేజీ తరువాయి)

52 మంది పురుషులు, 42 మంది మహిళలు, 15 మంది చిన్నారులు (తొమ్మిది మంది బాలికలు, ఆరుగురు బాలురు) ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రమాదం నుంచి 80 మందికి పైగా ప్రాణాలతో బయటపడగా, వారందరూ ఇథియోపియా జాతీయులని ఐఓఎం తెలిపింది. వీరిలో 64 మందికి ఒబాక్‌లోని తమ మైగ్రెంట్ రెస్పాన్స్ సెంటర్‌లో ఆశ్రయం కల్పించి, అవసరమైన సహాయం అందిస్తున్నట్లు పేర్కొంది. జిబౌటియన్ అధికారులు గల్లంతైన వారి కోసం గాలింపు మరియు సహాయక చర్యలను ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. పడవ మునిగిపోవడానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు.

ఈ ఘటనపై జిబౌటిలోని ఐఓఎం చీఫ్ ఆఫ్ మిషన్ అలెగ్జాండర్ కోయిసాక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "ఇది హృదయ విదారకమైన ప్రాణ నష్టం. గల్ఫ్ దేశాలకు చేరుకోవాలనే ఆశతో వేలాది మంది వలస జీవులు ప్రయాణించే ఈ మార్గంలో ఉన్న ప్రమాదాలకు ఈ ఘటన అద్దం పడుతోంది" అని ఆయన అన్నారు. ఐఓఎం మిస్సింగ్ మైగ్రెంట్స్ ప్రాజెక్ట్ ప్రకారం, 2025లోనే ఈ మార్గంలో 900 మందికి పైగా వలసదారులు మరణించడం లేదా గల్లంతవడం గమనార్హం.

# ఢిల్లీ-చెన్నై ఇండిగో విమానంలో కలకలం

(మొదటి పేజీ తరువాయి)

విమానాశ్రయానికి అత్యవసరంగా మళ్లించారు. వివరాల్లోకి వెళితే, ఆదివారం మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో ఇండిగో విమానం 6ఇ6115 ఢిల్లీ నుంచి చెన్నైకి బయలుదేరింది. విమానం గాల్లో ఉండగా, ఓవర్ హెడ్ లగేజీ కంపార్ట్‌మెంట్‌లో ఉన్న ఓ ప్రయాణికుడి పవర్ బ్యాంక్ నుంచి అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. పొగలు రావడాన్ని గమనించిన క్యాబిన్ సిబ్బంది వెంటనే స్పందించి, విమానంలో అందుబాటులో ఉన్న భద్రతా పరికరాలతో మంటలను అదుపులోకి తెచ్చారు.

ముందుజాగ్రత్త చర్యగా, పైలట్ విమానాన్ని సమీపంలోని హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (RGIA) వైపు మళ్లించారు. విమానం శంషాబాద్‌లో సురక్షితంగా ల్యాండ్ అవ్వడంతో ప్రయాణికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులు, సిబ్బంది అంతా క్షేమంగా ఉన్నారని ఇండిగో సంస్థ ప్రకటించింది. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. అగ్నిప్రమాదానికి దారితీసిన కచ్చితమైన కారణాలను, ఆ పవర్ బ్యాంక్ ఏ కంపెనీకి చెందినది అనే వివరాలను సేకరిస్తున్నారు. కాగా, విమాన ప్రయాణాల్లో లిథియం-అయాన్ బ్యాటరీలు, పవర్ బ్యాంకుల వల్ల అగ్నిప్రమాదాలు జరిగే ప్రమాదం ఉన్నందున, వీటిని కేవలం క్యాబిన్ బ్యాగేజీలోనే ఉంచాలని, విమానంలో ఛార్జింగ్ చేయరాదని విమానయాన నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నిబంధనల ప్రాముఖ్యతను తాజా ఘటన మరోసారి గుర్తుచేసింది.

## నేతలు నిర్బంధంలో.. జంతర్ మంతర్ వద్ద ఉత్కంఠగా సీజేపీ ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

ఆందోళనకు ముందుండి నడిపిస్తున్న కీలక నేతలు అభిజీత్ దీప్కే, అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌లను పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఉద్యమానికి దిశానిర్దేశం చేసే ముఖ్య నాయకులు అందుబాటులో లేని ఈ తరుణంలో.. కార్యకర్తలు, మద్దతుదారులు ఏ స్థాయిలో సమీకృతమవుతారనేది ఇప్పుడు పెద్ద సవాల్‌గా మారింది. నాయకులను నిర్బంధించడం ద్వారా నిరసనలను పూర్తిగా అణచివేయగలమని భావిస్తున్న ప్రభుత్వ వ్యూహం ఫలిస్తుందా? లేక ఈ చర్యలు మరింతగా ఆందోళనకారుల్లో కసితో పాటు ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా విస్తరించేలా చేస్తాయా? అనే ప్రశ్నలకు కాలమే సమాధానం చెప్పాలి. ఉదయం నుంచి జంతర్‌మంతర్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీగా మోహరించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## సీజేఐ అపాయింట్‌మెంట్ కోరిన ఖర్గే, రాహుల్

(మొదటి పేజీ తరువాయి)

ఎలాంటి ఒత్తిడి తెచ్చే ఉద్దేశం లేదని ఆయన మాటలు సూచించాయి.

**భారీ భద్రతపై ప్రశ్నలు**

యువత ఆందోళనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశంలో భయం, అనిశ్చితి వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ఖర్గే ఆరోపించారు. నిరసనను ఎదుర్కొనేందుకు పెద్ద ఎత్తున భద్రతా బలగాలను రంగంలోకి దింపడాన్ని ఆయన తీవ్రంగా ప్రశ్నించారు. దాదాపు 32 వేల మంది పోలీసులు, సుమారు 7,500 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని మోహరించారని ఖర్గే గణాంకాలను ప్రస్తావించారు. ఇంత భారీ స్థాయిలో ఏర్పాట్లు చేయడమే నిరసన పట్ల ప్రభుత్వంలో ఉన్న భయానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.

**ఎమర్జెన్సీతో పోలిక**

ప్రస్తుత పరిస్థితిని ఖర్గే ఎమర్జెన్సీ కాలంతో పోల్చారు. ఇటీవలి ఆందోళన సందర్భంగా విధించిన ఆంక్షలు, చేపట్టిన భద్రతా చర్యలు పౌరులకు నిరసన తెలిపే స్వేచ్ఛ ఉందా అన్న సందేహాలను రేకెత్తిస్తున్నాయని అన్నారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కుకు భంగం కలుగుతోందన్న ఆందోళనను ఆయన వ్యక్తం చేశారు.

**సీఈసీకి రక్షణపై విమర్శలు**

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్లకు 2023 నాటి చట్టం కింద కల్పించిన చట్టపరమైన రక్షణను కూడా ఖర్గే తప్పుబట్టారు. ఎన్నికల అధికారులపై న్యాయపరమైన చర్యలు తీసుకునే వీలు లేకుండా వారిని కాపాడేందుకే ఆ చట్టాన్ని తీసుకొచ్చారని ఆయన ఆరోపించారు.

**న్యాయవ్యవస్థ వైపు కాంగ్రెస్ చూపు**

ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలను, నిరసనల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని కాంగ్రెస్ కొంతకాలంగా నిరంతరం లేవనెత్తుతూ వస్తోంది. ఇప్పుడు అవే అంశాలను న్యాయవ్యవస్థ ముందు ఉంచాలన్న పార్టీ ఉద్దేశాన్ని ఖర్గే తాజా వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. అయితే సీజేఐతో సమావేశం ఇంకా ఖరారు కాలేదు. కాంగ్రెస్ నేతల అభ్యర్థనపై ప్రధాన న్యాయమూర్తి కార్యాలయం నుంచి స్పందన రావాల్సి ఉంది.

# నవరాత్రుల ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదు: ఎస్సై టి. మురళి హెచ్చరిక

**రామారెడ్డి, యువ వెలుగు, 11 అక్టోబర్ :** దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలను ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపు కోవాలని రామారెడ్డి ఎస్సై టి. మురళి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో దుర్గా మాత విగ్రహాలను ప్రతిష్ఠించే నిర్వాహకులు, కమి టీ సభ్యులతో శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రత్యేక శాంతిభద్రతల సమీక్షా సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్త లు, ప్రభుత్వ నిబంధనలపై నిర్వాహకులకు దిశానిర్దేశం చేశారు.సమావేశంలో ఎస్సై మురళి మాట్లాడుతూ... పవిత్రమైన నవరాత్రి వేడుకల్లో యువత సంయమనం పాటించాలని, గ్రామాల్లో ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా సమన్వయంతో వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ముఖ్యంగా మాత విగ్రహాల వద్ద, మండపాల పరిసరాల్లో డీజే (ఐజీ) సౌండ్ సిస్టమ్‌లను ఏర్పాటు చేయడానికి ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. కేవలం నిర్ణీత డెసిబుల్స్ పరిమితికి లోబడి మాత్రమే సంప్రదా య మైకులను వాడుకోవాలని తెలిపారు.శబ్ద కాలు ష్యంపై సుప్రీంకోర్టు వెలువరించిన మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాల్సిందేనని తేల్చిచెప్పారు. అధిక శబ్దాలతో కూడిన డీజేలు ఏర్పాటు చేసి వృద్ధులు, చిన్నపిల్లలు, రోగులు మరియు పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘించి డీజేలు నడిపితే బాధ్యులైన నిర్వాహకులతో




పాటు సౌండ్ సిస్టమ్ యజమానులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని, పరికరాలను కూడా సీజ్ చేస్తామని హెచ్చరించారు. భక్తిభావం, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించు కోవాలని కోరారు. ఉత్సవాల ముగింపు, నిమజ్జన ఊరేగింపుల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు పూర్తి బాధ్యత వహించాలని, పోలీసు శాఖకు సహకరిం చాలని ఎస్సై టి. మురళి విజ్ఞప్తి చేశారు. ఈ సమా వేశంలో మండల పరిధిలో ని వివిధ గ్రామాల ఉత్సవ కమిటీ ప్రతినిధులు, నిర్వాహకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కోదాడలో వాసవి క్లబ్ సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నప్రసాద వితరణ

**సూర్యాపేట జిల్లా/ కోదాడ, యువ వెలుగు, 11 అక్టోబర్ :** మహాలయ అమావాస్య సందర్భాన్ని పురస్కరిం చుకుని, వాసవి క్లబ్ సీనియర్ సిటిజన్స్ కోదాడ శాఖ ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ ఎదురుగా ఉన్న మినీ ట్రాలీ ఆటో అడ్డా వద్ద ఘనంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు సామి పుల్లయ్య, కార్యదర్శి తోట రమేష్ బాబు, ఉపాధ్యక్షులు మట్టపల్లి శ్రీనివాస రావుల నేతృత్వంలో ఈ సేవా కార్యక్రమం విజయ వంతంగా సాగింది. పలువురు దాతలు తమ కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం అందించిన ద్రవ్య సహాయంతో ఈ అన్నదానాన్ని ఏర్పాటు చేశారు.



**దాతల వివరాలు:** స్వామి వెంకటనారాయణ జ్ఞాపకార్థం: స్వామి పుల్లయ్య, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, కృష్ణ. అనుమోలు నరసింహారావు

**జ్ఞాపకార్థం:** వారి ధర్మపత్ని వెంకటరత్నం.

పెనుగొండ సత్యనారాయణ – చూడమ్మ గార్ల జ్ఞాపకార్థం: వారి మనవడు వంగవీటి వెంకట గురుమూర్తి, శ్రీలక్ష్మి.

తోట అనంతరామయ్య – రంగమ్మ గార్ల **జ్ఞాపకార్థం:** వారి కుమారుడు రమేష్ బాబు, రజిని.

బొగ్గరపు వెంకయ్య – సీతారామమ్మ గార్ల జ్ఞాపకార్థం: వారి కుమారుడు, కోడలు వెంకటాద్రి, శ్రీదేవి.

ఓరుగంటి సత్యనారాయణ – విశాలక్ష్మి, చంద్రకళల జ్ఞాపకార్థం: ఓరుగంటి నరసింహారావు.

చల్లా రత్నయ్య – రుక్మిణమ్మల జ్ఞాపకార్థం: వారి కుమారుడు, కోడలు వెంకటేశ్వరరావు, రత్నమాల.

**హాజరైన ప్రముఖులు:** ఈ కార్యక్రమంలో ఐఇసి వంగవీటి వెంకట గురుమూర్తి, రీజినల్ చైర్మన్ వంగవీటి నాగరాజు, ఐపీసీలు వంగవీటి లోకేష్, చల్లా విజయ శేఖర్, డిస్టిక్ సహాయ కార్యదర్శి ఇమ్మడి సతీష్ బాబు, డిస్టిక్ సహాయ కోశాధికారి బండారు శ్రీనివాసరావు, డిస్టిక్ ఇంచార్జ్ లు బోనాల సైదారావు, బెలిదే భరత్, రీజినల్ సెక్రెటరీ తొడుపునూరి మంజుల, రాయపూడి వెంకటనారాయణ పాల్గొన్నారు. వీరితో పాటు క్లబ్ సభ్యులు స్వామి శ్రీనివాసరావు, కంది బండ ప్రభాకర్ రావు, ఓరుగంటి వెంకటేశ్వర్లు, బొడ్ల మదన్మోహన్, వి. వెంకట రమణ, బత్తిని కృష్ణ, అనుమోలు వెంకటరత్నం, స్వామి సత్యవతి, అనురాధ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మహాలయ అమావాస్య నాడు ఆటో కార్మికులకు, నిరుపేదలకు అన్నప్రసాద వితరణ చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# మాసఅమావాస్య వేడుకల్లో వైభవంగా సహస్రనామ పుష్పార్చన



**మేళ్లచెరువు, యువ వెలుగు, 11 అక్టోబర్ :** మేళ్లచెరువు మండల కేంద్రంలోని శ్రీ ఇష్టకామేశ్వరి స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి దేవస్థానంలో మాసఅమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని సహస్రనామ పుష్పార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, వాయు లింగానికి అభిషేకం, శ్రీ ఇష్టకామేశ్వరి అమ్మవారికి పంచామృత అభిషేకం, రాహు–కేతువులకు ప్రత్యేక అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఉదయం 10 గంటలకు స్వామివారికి సహస్రనామ పుష్పార్చన నిర్వహించారు. పుష్పార్చన అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించి మహానైవేద్యం, నీరాజనం, మంత్రపుష్పం సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అర్చకులు కొంకపాక శివ విష్ణువర్ధన్ శర్మ. శివధనుంజయ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణ అధికారి నాగేళ్ల శంబిరెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పెండ్లి లచ్చయ్య, స్థానిక ఇన్‌చార్జి ఎలక్ట్రికల్ ఏఈ సైదయ్య, నరసింహారావు, దేవస్థాన సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# ఆడపడుచుల ఆత్మ గౌరవం బతుకమ్మ

## ఆడపడుచులందరూ పాల్గొని విజయవంతం చేయాలి

## మున్సిపల్ ఛైర్పర్సన్ ఎర్నేని కుసుమ

**సూర్యాపేట, యువ వెలుగు, 11 అక్టోబర్ :** బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు, పూల సౌందర్యానికి ప్రతీక. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఐకమత్యం, స్త్రీల సృజనాత్మకతను చాటిచెప్పే అద్భుతమైన పండుగ బతుకమ్మ అని మున్సిపల్ ఛైర్పర్సన్ ఎర్నేని కుసుమ అన్నారు.శనివారం కోదాడ బాయ్స్ హై స్కూల్ నందు కోదాడ పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బతుకమ్మ వేడుకల ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మహిళా మణులు అందరికీ బతుకమ్మ పండుగ మరియు దసరా పండుగ శు భాకాంక్షలు తెలియజేశారు. మహిళలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మాట్లాడుతూ.. బతుకమ్మ అంటే "బతుకు అమ్మా!" అని అర్థం. అమ్మవారిని ప్రకృతి స్వరూపిణిగా భావించి, వివిధ రకాల కాలానుగుణ పూలతో బతుకమ్మను పేర్చి, భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. మహిళలు,బాలికలు సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మ చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ సంబరాలు జరుపుకుంటారని తెలిపారు. బతుకమ్మ పండుగ రోజు వారి విశిష్టత గురించి వివరించారు.

బతుకమ్మ పండుగ విశిష్ఠత



ప్రకృతి ఆరాధన తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి పూలతో ప్రకృతిని పూజించడం జరుగుతుందన్నారు.

గౌరీదేవిని పూజిస్తూ మహిళల జీవన సౌభాగ్యం, కుటుంబ శ్రేయస్సును ఆకాంక్షించడం స్త్రీల గౌరవం అని అన్నారు. కులమత భేదాలు లేకుండా మహిళలంతా ఒకచోట చేరి పండుగ జరుపుకోవడం బతుకమ్మ ప్రత్యేకత అన్నారు. జానపద పాటలు, ఆటలు, సంప్రదాయ దుస్తులు, పూల అలంకరణలతో ప్రాంతీయ వారసత్వాన్ని కాపాడుకోవడం, స్థానికంగా లభించే పూలను ఉపయోగించడం ద్వారా ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేయడం, బతుకమ్మను సాధారణంగా ఆశ్వయుజ మాసంలో మహాలయ అమావాస్య నుంచి తొమ్మిది రోజులపాటు జరుపుకుంటారు. ప్రతి రోజుకు ఒక ప్రత్యేకమైన పేరు, నైవేద్యం, ఆచార ప్రాధాన్యం ఉంటాయి అన్నారు. ఈ కార్యక్రమంలో నూనె సులోచన, మున్సిపల్ అధికారులు స్థానిక నాయకులు కౌన్సిలర్ వంగూరి గోపి, కొల్లు చత్రయ్య, మందలపు శేషయ్యః, మైలారి శెట్టి భాస్కర్, మల్లె కొండలు, ఎర్నేని రత్న కుమార్, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎంగిలి పువ్వు బతుకమ్మ సంబరాలు

## తెలంగాణ సాంప్రదాయంలో బతుకమ్మ పూల సందడి



**సూర్యాపేట/తుంగతుర్తి, యువ వెలుగు, 11 అక్టోబర్ :**తుంగతుర్తి మండల పరిధిలోని పలు గ్రామాలలో ఈరోజు సద్దుల బతుకమ్మ మొదటి రోజు ప్రారంభంలో ప్రతి గ్రామంలోని గ్రామ సర్పంచులు గ్రామాల మహిళలు అధిక సంఖ్యలో బతుకమ్మ లను పేర్కొని సందడిగా ప్రతి గ్రామంలోని బతుకమ్మ ప్రాంగణం వద్ద ఆటపాటలతో మహిళలు రంగురంగుల రకరకాల పూల బతుకమ్మలతో ఆటపాటలు కోలాటాలతో సంబరాలు చేశారు.అన్ని గ్రామాలలో ఎంగిలిపు బతుకమ్మను గ్రామ ప్రజలు మహిళలు ఘనంగా జరుపుకున్నారు.

# నాగారంలో ఘనంగా ఎంగిలిపువ్వు బతుకమ్మ వేడుకలు



**సూర్యాపేట /నాగారం, యువ వెలుగు, 11 అక్టోబర్ :** నాగారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఎంగిలిపువ్వు బతుకమ్మ పండుగను శనివారం మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు గునుగు తంగేడు బంతి చామంతి రంగు రంగుల పూలతో బతుకమ్మలను అలంకరించుకొని, సాయంకాలం భక్తి, శ్రద్ధలతో గ్రామాల్లోని పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఊరు చివర ఉన్న చెరువు గట్ల వద్దకు తీసుకెళ్లి బతుకమ్మలను గుండ్రగా పేర్చి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో...., చిత్తూ చిత్తూల బొమ్మ శివుని ముద్దుల గుమ్మా అంటూ ఊయ్యాల పాటలు పాడుతూ ఆటలు ఆడుతూ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం బతుకమ్మలను ఆయా గ్రామాల చెరువులలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజలు, మహిళలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# మునగాల దళితవాడలో కమ్యూనిటీ హాల్ కరువు

## 300 కుటుంబాల ఆవేదనకు అంతం ఎప్పుడు?

**సూర్యాపేట జిల్లా/మునగాల, యువ వెలుగు, 11 అక్టోబర్ :** అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాలు మాత్రమే కాదు.. అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టడం. కానీ మునగాల మండల కేంద్రంలోని దళితవాడలో ఆ ఆత్మగౌరవానికి ప్రతీక అయిన కమ్యూనిటీ హాల్ ఏళ్లుగా కనుమరుగై, దళితుల గోడును ఎవరూ పట్టించుకోని పరిస్థితి నెలకొంది.

**ఒకప్పుడు పరిపాలన కేంద్రం.. నేడు శిథిలాల గుర్తు కూడా లేదు!**

మునగాల మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సుమారు 300 కుటుంబాలు, మూడు వార్డుల పరిధిలో దాదాపు 900 మంది ఓటర్లు నివసిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో జాతీయ రహదారి 65 పక్కన ఎంతో ఘనంగా ఎస్సీ కమ్యూనిటీ హాల్ ను నిర్మించారు. ఆ రోజుల్లో మునగాలలో సొంత ఎంపీడీవో కార్యాలయం కూడా లేకపోవడంతో, ఈ కమ్యూనిటీ హాల్ నుండే మండల పరిపాలన సాగింది. అంతటి చరిత్ర కలిగిన భవనం, జాతీయ రహదారి విస్తరణ పనుల్లో కూల్చివేయబడింది. రోడ్డు వెడల్పయింది.. కానీ దళితుల జీవితాల్లో మాత్రం చీకటి నిండింది. కూల్చిన చోట మళ్లీ భవనం కడతామని అప్పటి అధికారులు, నాయకులు హామీలు గుప్పించారు. కానీ ఆ హామీలు హామీలుగానే మిగిలిపోయాయి. ఏ ప్రభుత్వం కూడా తిరిగి నిర్మించేందుకు ముందుకు రాలేదు.

**ఓట్లప్పుడు ఒక మాట.. గెలిచాక మరో మాట!**

ఎన్నికల సమయంలో దళితవాడలో ఓట్ల కోసం తిరిగే నాయకులు, గెలిచిన తర్వాత ఈ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఒక పూట




సమావేశం పెట్టుకోవాలన్నా, పెళ్లి, చావు వంటి కార్యక్రమాలు చేసుకోవాలన్నా సరైన వసతి లేక వీధుల్లోనే, ఎండలోనే అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. మాకు భారీ భవనాలు వద్దు.. మా ఆడబిడ్డల పెళ్లిళ్లు, మా కష్టసుఖాలు చెప్పుకునేందుకు ఒక చిన్న పైకప్పు చాలు" అంటూ కాలనీ పెద్దలు కన్నీటి పర్యంతమవుతున్నారు.

**ప్రభుత్వం స్పందించాలి**

సూర్యాపేట జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, మునగాల ఎస్సీ కాలనీలో నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, దళితుల చిరకాల వాంఛను నెరవేర్చాలని కాలనీవాసులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా పట్టించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

# ఎండిపోయిన వరి పంటలను ఆదుకోవాలి



**సూర్యాపేట /నాగారం, యువ వెలుగు, 11 అక్టోబర్ :**ఎండిపోయిన వరి పంటలను కరెంటు సక్రమంగా ఇచ్చి ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నాగారం మండల కేంద్రంలో ధర్నా చేసి విద్యుత్ ఏఈఈకి వినతి పత్రం ఇచ్చారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అఖిల భారత రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, జిల్లా సహాయ కార్యదర్శి సంపేట కాశయ్య పాల్గొని మాట్లాడుతూ వ్యవసాయాన్ని నమ్ముకుని వేలకు వేలు పెట్టుబడి పెట్టి వరి సాగు చేసిన రైతులు వర్షాలు పడక సాగునీరు సరిపడా అందక పోవడంతో వచ్చిరాని సమస్యలు, కరెంటు సమస్యలతో వేలాది ఎకరాలు వరి పంటలు ఎండిపోవడంతో గుండెలు బాదుకుంటూ మానసిక వేదనకు గురవుతున్నారని వారన్నారు. ప్రభుత్వం బాధ్యత లేకుండా వ్యవహరిస్తుందని ఇప్పటికైనా నాణ్యమైన, లో వోల్టేజ్ సమస్య లేకుండా 12 గంటలు కరెంటు ఇచ్చి ఎండిపోయిన వరి పొలాలను కాపాడాలని అన్నారు.ఈ కార్యక్రమం లో పోలేబోయిన కిరణ్, యానాల సుధాకర్ రెడ్డి,దోమలపల్లి గోవర్ధన్,సంపేట కృష్ణమూర్తి, దిగోజు పోతులూరు, భయం లింగయ్య, జాజుల సామెలు,లింగారెడ్డి, చింతల చెరువు నాగరాజు, గాడుదల శ్రీను, పల్లెర్ల సోమయ్య, వార్డు మెంబర్స్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండలో జరుగు రైతు మహాసభలను జయప్రదం చేయాలి

**సూర్యాపేట జిల్లా/ మునగాల, యువ వెలుగు, 11 అక్టోబర్ :** నల్లగొండలో నవంబర్ 15 నుండి 18వ తేదీ వరకు జరగనున్న అఖిల భారత 36 వ రైతు మహాసభలను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దేవరం వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. మునగాల మండల కేంద్రంలో రైతులతో కలిసి మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వానాకాలంలో రైతులు అష్టకష్టాలు పడ్డారని, ఎకరాకు 30 వేలకు పైగా పెట్టుబడి పెట్టి వరి సాగు చేశారని తెలిపారు. కరెంటు సరిగా సప్లై కాకపోవడంతో పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉందని, ఈ నెల రోజులు రోజుకు 16 గంటలకు తగ్గకుండా కరెంటు ఇస్తేనే పంటలు చేతికి వచ్చే అవకాశం ఉందని అన్నారు. అలాగే నాగార్జున సాగర్ ఎడమ కాలువ ద్వారా వెంటనే నీటిని విడుదల చేసి ఎండుతున్న పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మునగాల గ్రామ శాఖ కార్యదర్శులు గడ్డం వినోద్, కిన్నెర వెంకన్న, రైతులు దేవరం శ్రీనివాస్ రెడ్డి, గిరిబాబు, శ్యామ్ సుందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాలికల సాధికతకు కృషి చెయ్యాలి

## షీ టీం ఎస్ఐ మల్లేష్, జిల్లా కోఆర్డినేటర్ ఒగ్గు సోమన్న

**సూర్యాపేట జిల్లా/కోదాడ, యువ వెలుగు, 11 అక్టోబర్ :** బాలికల సాధికరతకు కృషి చేయాలని షీ టీం ఎస్ఐ మల్లేష్, యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సంస్థ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ ఒగ్గు సోమన్న, న్యాయవాది ఉయ్యాల నరసయ్య అన్నారు. శనివారం కోదాడ కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్, మరియు జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం ను పుష్కరించుకొని బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికల విద్యను ప్రోత్సహించి వారి హక్కులను కాపాడాలని అన్నారు. పోక్స్ యాక్ట్ 2012, బాల్య వివాహాల నిషేధ చట్టం2006, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం 1994, బాలల ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009, బాల కార్మిక నిషేధ మరియు నియంత్రణ చట్టం 1986 చట్టాలపై అవగాహన కల్పించారు, బాలికల పై దాడులు, హింసలను, వేధింపులను అరికట్టాలని అన్నారు. బాల్యవివాహాల వల్ల జరిగే నష్టాలపైబాలికల బాలికలకు వివరించారు బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు అనంతరం బాల్య వ్యవహరించాలని కోరుతూ బాలికలతో బ్రతికి చేయించారు ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ, ప్రిన్సిపల్ పెరుమళ్లపల్లి గాంధీ, కాలేజీ ఇంచార్జ్ ముత్యాలు, ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ఒగ్గు సోమన్న, షీ టీం కానిస్టేబుల్ జ్యోతి,సౌజన్య, ఎయిడ్ సంస్థ మండల కమ్యూనిటీ సోషల్ మొబిలైజర్స్ వెంకటేష్, కరుణాకర్, విద్యార్థినులు పాల్గొన్నారు.

# వట్పల్లి మండల ఏర్పాటు వెనుక కాంగ్రెస్ నాయకుల పోరాటం కీలకం!

**17 మంది కాంగ్రెస్ నాయకులపై కేసులు.. మండల సాధన ఉద్యమంలో కీలక పరిణామం**
**నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపిన మంత్రి దామోదర్ రాజనర్సింహ**




**వట్పల్లి, యువ వెలుగు, అక్టోబర్ 11 :** వట్పల్లి మండల ఏర్పాటు వెనుక కాంగ్రెస్ పార్టీ నాయకుల పోరాటం, కృషి కీలక పాత్ర పోషించాయని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. మండల సాధన కోసం గతంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 17 మంది నాయకులపై కేసులు నమోదు కావడం అప్పట్లో చర్చనీయాంశంగా మారిందని గుర్తుచేస్తున్నాయి. ఈ పరిణామం అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు దృష్టికి వెళ్లడంతో మండల ఏర్పాటు అంశానికి మరింత ప్రాధాన్యత లభించిందని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. మండల ఏర్పాటు కోసం అప్పట్లో చేపట్టిన నిరాహార దీక్షకు ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరై సంఘీభావం ప్రకటించడం ఉద్యమంలో ముఖ్యమైన పరిణామంగా నిలిచిందని వారు పేర్కొంటున్నారు. ప్రజల పరిపాలనా సౌలభ్యం, స్థానిక అభివృద్ధి లక్ష్యంగా మండల సాధన కోసం నాయకులు చేసిన ప్రయత్నాలను ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు.

**పోరాటాలను విస్మరిస్తే చరిత్ర అసంపూర్ణం!**

"ఒక ప్రాంత అభివృద్ధి వెనుక ఎందరో నాయకుల కృషి, ప్రజల ఆకాంక్షలు, ఉద్యమకారుల త్యాగాలు ఉంటాయి. సాధించిన విజయాలను గుర్తుంచుకోవడమే కాదు.. వాటి కోసం పోరాడిన వారిని స్మరించుకోవడం కూడా మన బాధ్యత." వట్పల్లి మండల ఏర్పాటు చరిత్రను ప్రస్తావించే సమయంలో మండల సాధన కోసం పోరాడిన కాంగ్రెస్ నాయకుల పాత్రను విస్మరించ కూడదని ఆ పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మండల ఏర్పాటు కోసం కేసులను ఎదుర్కొంటూ, నిరాహార దీక్షలు, ఆందోళనల ద్వారా తమ నిరసనను తెలిపిన నాయకుల కృషిని ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నాయి. మండల సాధన ఉద్యమంలో పాల్గొన్న నాయకుల వివరాలు, అప్పటి సంఘటనలు, వారి సేవలను భావితరాలకు తెలియజేయడం ద్వారా వట్పల్లి మండల ఏర్పాటు చరిత్రను సమగ్రంగా నమోదు చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరుతున్నారు.

# పోతులబోగుడాలో ఘనంగా దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన

**భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు..**
**పాల్గొన్న సర్పంచ్ ముద్దాపురం రాజు, గ్రామ ప్రముఖులు**




**వట్పల్లి, యువ వెలుగు, అక్టోబర్ 11 :** వట్పల్లి మండల పరిధిలోని పోతులబోగుడా గ్రామంలో విజయదశమి నవరాత్రుల సందర్భంగా ఆదివారం దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజలు అమ్మవారి ఆశీస్సులు పొందారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు భక్తిపారవశ్యంతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**భక్తి, ఐక్యతకు ప్రతీకగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు**

దుర్గామాత అనుగ్రహంతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని భక్తులు ఆకాంక్షించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామ ప్రజల్లో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు మన సంప్రదాయాలు, సంస్కృతిని భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముద్దాపురం రాజు, కోసికె ప్రభాకర్, జంబిగే సంగమేశ్వర, కోసికె శేఖర్, బీపీ శేఖర్, బీపీ రాజశేఖర్, పట్లోల్ల భాను, బంగ్లా నర్సింలు, గురు నర్సింలు, ఆనంద్, చైతన్య తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు అమ్మవారి పూజల్లో పాల్గొని కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో విజయవంతం చేశారు.

# వీలున్న సమయంలో పిల్లలకు తమ అనుభవాలను తెలియజేయాలి

**- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**
**- నెరడిగొండ విశ్రాంత ఉపాధ్యాయుల భవనం ప్రారంభం**



**నేరడిగొండ, యువ వెలుగు, అక్టోబర్ 11 :** విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించి నేడు పదవి విరమణ పొందిన నేరేడుగుండా మండలంలోని విశ్రాంత ఉపాధ్యాయులు తమ విలువైన అనుభవాలను నేటి పిల్లలకు అందించాలని బోత్ ఎమ్మెల్యే అనిల్ యాదవ్ కోరారు. నెరడిగొండ మండల విశ్రాంత ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన భవన ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ను వారు శాలువతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..విశ్రాంత ఉపాధ్యాయులు వీలైన సమయంలో పిల్లలకు అవగాహన కల్పించాలని, విద్యార్థుల మెరుగు కొరకు సూచనలు చేస్తూ ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులతో పాటు ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## పశువైద్యశాలలో ఖాళీ కుర్చీ దర్శనం.. వైద్యం అందక పశువుల అవస్థలు

**శాశ్వత వెటర్నరీ డాక్టర్‌ను నియమించాలని రైతుల డిమాండ్**



**కోహీర్, యువ వెలుగు, అక్టోబర్ 11 :** కోహీర్ మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో పశు వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో మూగజీవులకు సకాలంలో వైద్యం అందడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పశువైద్యశాలకు వెళ్లినప్పుడు వైద్యుడి కుర్చీ ఖాళీగా దర్శనమిస్తోందని,అత్యవసర సమయాల్లో పశువులకు చికిత్స అందక పశుపోషకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులకు అనారోగ్యం కలిగినప్పుడు సకాలంలో వైద్యం అందకపోవడంతో కొన్ని పశువులు మృత్యువాత పడుతున్నాయని పశువుల యజమాన్యం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువుల మరణాలతో తమకు ఆర్థికంగా నష్టం వాటిల్లుతోందని వాపోతున్నారు. పశువులపై ఆధారపడి జీవనం సాగించే రైతులకు వైద్యసేవలు అందుబాటులో లేకపోవడం తీవ్ర సమస్యగా మారిందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కోహీర్ పశు వైద్యశాలకు శాశ్వత వెటర్నరీ డాక్టర్‌ను నియమించాలని, పశువులకు నిరంతరం వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు, పశువుల యజమాన్యం కోరుతున్నారు.

# మహమ్మద్ నగర్‌లో ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



**నిజాంసాగర్, యువ వెలుగు, అక్టోబర్ 11 :** మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు దపేదర్ వెంకన్న దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించి 12 వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. పురోహితుడు సంజీవ్ పంతులు ఆధ్వర్యంలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు,అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దపేదర్ బాలమణి, నాయకులు దపేదర్ విజయ్, దపేదర్ ప్రకాష్, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# డైట్ మైదానంలో దసరా వేడుకల ఉత్సవాలకు భూమి పూజ

**- డైట్ మైదానంలో దసరా వేడుకలు**
**- ఉత్సవాలకు భూమి పూజ**
**- సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కార్యక్రమం**



**ఆదిలాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 11 :** ప్రజలందరిపై దుర్గమ్మ ఆశీస్సులు ఉండాలని అందరూ సుఖ శాంతులతో వర్ధిల్లాలని ప్రతి ఏటా డైట్ మైదానంలో నిర్వహించే దసరా వేడుకలకు పలువురు ముఖ్య నేతలు రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు ఆదివారం భూమి పూజ చేశారు. సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక డైట్ కాలేజీ మైదానంలో బతుకమ్మ,దసరా వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథులుగా హాజరైన కందిమైనారెడ్డి రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ క్రాంతి కుమార్ రజిత దంపతులు సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ కత్రితో కలిసి భూమిపూజ పనులు ప్రారంభించారు. ముందుగా ప్రజలందరికీ దసరా దుర్గా నవరాత్రి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సనాతన హిందూ ఉత్సవ సమితి హిందూ సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడుతూ, పట్టణంలో సమాజ హితం కోసం అనేక హిందూ పండగల ఉత్సవాలు నిర్వహిస్తోందన్నారు. ఇలాగే మున్ముందు మరిన్ని ఉత్సవాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఇందులో నాయకులు బండారి సతీష్,సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ ఖత్రి,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ క్రాంతి,డాక్టర్ రజిత,సమితి గౌరవ అధ్యక్షులు కందుల రవీందర్,ప్రధాన కార్యదర్శి రేణికుంట రవీందర్, కోశాధికారి సంతోష్ అగర్వాల్,కార్యనిర్వహక అధ్యక్షులు దశరథ్, ఉపదక్షులు సమనపల్లి నర్సింలు,సురేష్ పొడవాల్ ,మహిపాల్, సుభాష్ ఉరడే,తిరుపతి రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# మాలల వర్గీకరణ, రోస్టర్ విధానంపై వ్యతిరేకత

**ఆదిలాబాద్‌కు బయలుదేరిన బోథ్ జై మాల సంక్షేమ సంఘం నాయకులు**



**బోథ్, యువ వెలుగు, అక్టోబర్ 11 :** ఎస్సీ వర్గీకరణ, రోస్టర్ పాయింట్ల కేటాయింపులో అవలంబిస్తున్న విధానానికి వ్యతిరేకంగా నిర్వహించనున్న మాలల సభకు హాజరయ్యేందుకు బోథ్ మండలానికి చెందిన జై మాల సంక్షేమ సంఘం నాయకులు ఆదిలాబాద్‌కు బయలుదేరారు. బోథ్ మండల అధ్యక్షుడు ఎల్కరాజు ఆధ్వర్యంలో సంఘం నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో కునుగుట్ట బోడ లక్ష్మణ్, బోథ్ గ్రామ అధ్యక్షుడు సురేందర్, ప్రధాన కార్యదర్శి ఉషన్న, గంగయ్య, రమేష్, స్వామి, కర్ణాకర్, చిలుక లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణ, రోస్టర్ పాయింట్ల అమలులో మాలలకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేస్తూ సభలో తమ నిరసనను తెలియజేయడానికి నాయకులు బయలుదేరినట్లు తెలిపారు.

# నాగేపల్లిలో ఉచిత వైద్య శిబిరం

**మంథని, యువ వెలుగు, అక్టోబర్ 11 :** మంథని మండలంలోని నాగేపల్లి గ్రామంలో వార్డు సభ్యుడు బొమ్మకంటి సతీష్ ఆధ్వర్యంలో కొండపర్తి హరీష్, కొండపర్తి అఖిల నరేష్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ గుమ్మడి సమ్మయ్య మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. బీపీ, షుగర్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన చికిత్స తీసుకుంటే ఆరోగ్య సమస్యలను నియంత్రించవచ్చని పేర్కొన్నారు.

# పోలీస్ నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

**బీఆర్ టీయూ జిల్లా అధ్యక్షులు టైగర్ కృష్ణయ్య హౌస్ అరెస్ట్**




**వికారాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 11 :** రేవంత్ రెడ్డి, పోలీస్ నిర్బంధాలతో ఉద్యమాలను అపలేవని బీఆర్ టీయూ జిల్లా అధ్యక్షులు టైగర్ కృష్ణయ్య హెచ్చరించారు. ఆదివారం కొడంగల్‌లో ఆశావర్కర్ల మహా సభలు ఉండగా ముందుగానే బీఆర్ టియూ జిల్లా అధ్యక్షులు టైగర్ కృష్ణయ్యను పోలీసులు హౌస్ అరెస్టు చేసి, అనంతరం వికారాబాద్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కొడంగల్‌లో శాంతి యుతంగా ఆశా వర్కర్స్ జిల్లా మహాసభలు జరుపుకుంటామంటే రేవంత్ రెడ్డికి ఎందుకు ఇంత భయమని కృష్ణయ్య ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ఎన్ని రోజులు పోలీస్ అరెస్టులతో నిర్బంధాలతో, పాలన సాగిస్తావని కృష్ణయ్య సూటిగా ప్రశ్నించారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలకు ఒక రోజు ముందే నుండే బీఆర్ టీయూ జిల్లా నాయకులను, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులను, మరియు ఆశా లను,అర్థరాత్రి వేళల్లో ఇంట్లోకి జొరబడి బలవంతంగా, అక్రమంగా, అరెస్టులు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తిప్పడం, నిర్బంధాలు కొనసాగించడం? ఏంటని అన్నారు. ఆశా వర్కర్స్ అంటే భయముంటే, సీఎం రేవంత్ రెడ్డి నీ మేనిపేస్టోలో ప్రకటించినట్లుగా ఆశ లకు నెలకు రూ. 18.000 జీతం వెంటనే ప్రకటించాలని, ఉద్యోగ భద్రత కల్పిస్తామన్న, హామీని, ఆశా వర్కర్స్‌కు ప్రభుత్వ పథకాలను వర్తింప చేస్తామన్న హామీలని నిలబెట్టుకోవాలని సూచించారు. కొడంగల్‌లో ఆశా వర్కర్లు మీటింగ్ పెట్టకూడదని, పోలీస్‌లు కండీషన్లు పెట్టడం ఎంటాని కృష్ణయ్య ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లో అరెస్టు చేసిన ఆశా లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాబోవు రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ, కచ్చితంగా మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. వికారాబాద్‌లో అరెస్టు అయిన వారిలో తెలంగాణ గ్రామీణ ఆరోగ్య ఆశ కార్యకర్తల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే.అనిత, స్వరూప రజితలు ఉన్నారు.

# భక్తి పారవశ్యంలో జిన్నారం.. దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

- మూడు ఆలయాలతో పాటు యువజన మండపంలోనూ ప్రత్యేక పూజలు
- పది రోజులపాటు పది రూపాల్లో అమ్మవారి దర్శనం
- అభిషేకాలు, విశేష నైవేద్యాలు.. భక్తులకు ప్రసాద వితరణ




**జిన్నారం, యువ వెలుగు, అక్టోబర్ 11 :** అమ్మవారి నామస్మరణలు.. మంగళవాయిద్యాలు.. ప్రత్యేక పూజలతో జిన్నారం గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. గ్రామంలో దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. భక్తుల కొంగుబంగారమైన వనదుర్గమ్మ ఆలయంతో పాటు నూతనంగా నిర్మించిన మరకత లింగ ఆలయంలోని పార్వతీ మాత సన్నిధిలో, యువకులు ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. పది రోజులపాటు అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరించి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నారు. ప్రతిరోజూ విశేష నైవేద్యాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేయనున్నారు. ఉత్సవాల నేపథ్యంలో గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది.

**రోజుకో అలంకారం.. ప్రత్యేక నైవేద్యం**

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు గాయత్రీదేవి, మూడో రోజు అన్నపూర్ణాదేవి, నాలుగో రోజు మహాచండీ, ఐదో రోజు లలితాదేవి, ఆరో రోజు సరస్వతీదేవి, ఏడో రోజు మహాలక్ష్మీదేవి, ఎనిమిదో రోజు దుర్గాదేవి, తొమ్మిదో రోజు మహిషాసురమర్దిని, పదో రోజు రాజరాజేశ్వరి దేవి అలంకరణల్లో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ప్రతిరోజూ అమ్మవారికి ఆయా రోజులకు అనుగుణంగా ప్రత్యేక నైవేద్యాలు సమర్పించనున్నారు. రవ్వ కేసరి, కొబ్బరి అన్నం, క్షీరాన్నం, కదంబం, అటుకుల పాయసం, బెల్లం అన్నం, కాటే పొంగలి, వడలు, పాయసాన్నం, చక్కెర పొంగలి, పులిహోర, మినప గారెలు తదితర నైవేద్యాలను సమర్పించేందుకు ఏర్పాట్లు చేశారు.

**భక్తులకు ఆలయ నిర్వాహకుల ఆహ్వానం**

దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని, ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరారు. పూజల్లో భాగస్వాములు కావాలనుకునే భక్తులు ముందుగా సమాచారం అందించాలని సూచించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.

# చెరువుపల్లి ఆడపడుచులకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ వడ్డే సైది రెడ్డి



**మాడుగులపల్లి, యువ వెలుగు, అక్టోబర్ 11 :** తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ సందర్భంగా చెరువుపల్లి గ్రామ ఆడపడుచులకు, గ్రామ ప్రజలందరికీ గ్రామ సర్పంచ్ వడ్డే సైది రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వడ్డే సైది రెడ్డి మాట్లాడుతూ... ప్రకృతిని, పూలను పూజించే విశిష్టమైన పండుగ బతుకమ్మ అని కొనియాడారు. తొమ్మిది రోజుల పాటు సాగే ఈ ఉత్సవాల్లో ఆడపడుచులంతా ఒక్కచోట చేరి ఆనందోత్సాహాలతో బతుకమ్మ ఆడడం గ్రామీణ ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. తీరొక్క పూలతో గౌరమ్మను కొలిచి, గ్రామంలోని ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. ఈ వేడుకలను గ్రామ ప్రజలు, మహిళలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఘనంగా జరుపుకోవాలని, గ్రామంలోని చెరువులు, కూడళ్ల వద్ద పంచాయతీ తరఫున అవసరమైన లైటింగ్, పారిశుద్ధ్య ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. చెరువుపల్లి గ్రామం సకల శుభాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ప్రకృతి దేవత గౌరమ్మను ప్రార్థిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**Editor P. Mahesh Goud,** Rachakonda printer's & publication's, Sri balaji printing press, H.No:-5-2-396, Venkateshwara colony, saheb nagar, Rangareddy, 500070
PRGI: TGTEL /26/A6429 office address : #5-4-183, Twin city towers complex, Abids, Hyd-500001, TG. yuvavelugu@gmail.com. Contact number : **9908 502 602**